# గెలుపు నాది

**ప**డమటి కొండల వెనుకకు కనుమరుగవుతున్న దినకరుడు కుంకుమ రాశిని వెదజల్లి పోయినట్లుగా ఆకాశమంతా ఎఱ్ఱని వింతకాంతితో మెరిసిపోతున్న సుందర సంధ్యాసమయం!

వాయుదేవుడు అలవోకగా పిల్లనగ్రోవి వూదుతున్నట్లుగా గాలి మెల మెల్లగా, అలలు అలలుగా సాగివస్తోన్న చల్లని సాయంత్రం!

అటువంటి సమయంలో... పూల మొక్కల మధ్య కూర్చుని కాఫీ తాగటమో... డాబా మీద అటూ ఇటూ పచార్లు చేయటమో మాధవ్ అలవాటు.

కానీ ఆరోజు అస్థిమితంగా తన గదిలో ప్రక్క మీద దొర్లుతున్నాడు. అతని మనసు నిరాశతో... ఆవేదనతో మూలుగుతోంది!

గీతతో తన పెళ్ళి జరగటం అసంభవమేనా! తన ప్రేమకి పూర్తిగా తెరపడి పోయినట్లేనా! ఈ ఆలోచనలు అతని మనసును ప్రశాంతంగా వుండనివ్వటంలేదు. అప్పటికి రెండు సార్లు చదివిన ఉత్తరాన్ని దిండు క్రింద నుండి తీసి మళ్ళా చదవటం మొదలు పెట్టాడు.

బావా!... నువ్విక్కడ నుండి వెళ్ళాక మంచిరోజు చూసి నాన్న మీ యింటికి బయలుదేరి వద్దామని అనుకుంటూండగా ఒక వార్త తెలిసింది. అదే, మన పెళ్ళి జరగటానికి వీల్లేదని అత్తయ్యా, జరిగి తీరాలని నువ్వూ పట్టుబట్టి కూర్చున్నారని!

ఎలా తెలిసిందంటావా, వార్తల్ని చేరవేసే బాధ్యత గల వ్యక్తులు మన బంధువర్గంలో చాలామందే వున్నారుగా! బావా, అత్తయ్యకు యిష్టం లేనందు వల్ల మన పెళ్ళి ప్రసక్తిని విరమించుకుందాం! పెద్దవాళ్ళను ఎదిరించి అయినా సరే ఈ పెళ్ళి చేసుకుంటానని నువ్వు అన్నట్లుగా విన్నాను. అది

విన్నప్పుడు నాలో సంతోషం ఒక కెరటంలా ఎగసిపడిన మాట నిజమే అయినా అది ఎంత మాత్రమూ నాకు సమ్మతం కాదు! మనకు జన్మనిచ్చి, ప్రేమానురాగాల్ని పంచి యిచ్చి, పెద్ద చేసిన వాళ్ళను పెళ్ళి విషయం వచ్చేసరికి ఎదిరించటం సమంజసమేనంటావా?

అందరి ఆమోదంతో జరిగే పెళ్ళిలోనే పరిపూర్ణమైన ఆనందం కలుగుతుంది! నేను కోడలిగా వెళ్ళబోయే యింటిలో నా భర్త మాత్రమే కాదు, ఆ యింటిలో అందరూ నన్ను ఆదరంగా ఆహ్వానించాలి! అభిమానించాలి! అది నా కోరిక! అందుకే ఒకసారి వెళ్ళి ప్రయత్నించి చూస్తానని నాన్న అంటే నేను ఒప్పుకోలేదు.

ఈ విషయం తెలియపరచటానికే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. 'ఎంత తేలికగా చెప్పేశావ్' అంటావేమో! కానీ నేనీ నిర్ణయాన్ని తీసుకోవటానికి, నా మనసును గట్టి పరుచుకోవటానికీ, నా సర్వశక్తుల్నీ కూడదీసుకోవాల్సి వచ్చింది! నిజం!

నువ్విక్కడ వున్నప్పుడు మా అందరితో ఎంతో చనువుగా వున్నావు. సరదాగా కబుర్లు చెప్పావు. నాతో స్నేహం కలిపావు. ప్రేమ వరకూ తీసుకెళ్ళావు. అంతవరకూ నీపై ఎటువంటి అభిప్రాయమూలేదు. అత్త కొడుకువనే అనుబంధమూ లేదు! కానీ ఆ కొద్ది రోజులలోనే మామూలుగా వున్న నా కన్నె మనసును కదిలించావు. కవ్వించావు! మళ్ళీ నేను యధాస్థితికి రావటానికి కొంత కాలం పడుతుందేమో గానీ అసాధ్యం మాత్రం కాదు. అందుకే పోస్టు గ్రాడ్యుయేషన్ అయ్యేంత వరకూ నా పెళ్ళి ప్రసక్తిని తేవద్దని యింట్లో గట్టిగా చెప్పేశాను. ఆ రెండేళ్ళూ నా మనసును చదువు మీదే కేంద్రీకరించటానికి ప్రయత్నిస్తాను.

నిన్నే విధంగానూ తప్పుపట్టటంలేదు. మన పెళ్ళి జరగాలని కోరుకున్నావు. జరుగుతుందని అనుకున్నావు. కానీ జరగటంలేదు. మనం అనుకున్నవన్నీ జరగవని అంటారందుకే!

నేను ప్రత్యుత్తరం ఆశించటంలేదు. బావా, నవరత్నాల సంగతి అత్తయ్యకు చెప్పలేదా?

ఓ... సరదాగా అడిగాలే, దీనికి నువ్వేం ఫీలవ్వకూ...!!

మనం మంచి స్నేహితులుగా వుండిపోదాం!

గుడ్‌బై, మై ఫ్రెండ్! గుడ్ బై!! – గీత

ఉత్తరాన్ని చదవటం ముగించి గాఢంగా నిట్టూర్చాడు మాధవ్? మొన్నీ మధ్య వచ్చి వెళ్ళిన రామ్మూర్తి బాబాయి ఆ రోజు యిక్కడ యింట్లో జరిగిన సంభాషణలన్నింటినీ అక్కడికి చేరవేశాడన్న మాట! రామ్మూర్తిబాబాయి వచ్చిన రోజు మాటల సందర్భంలో ఈ పెళ్ళి ప్రసక్తి వచ్చింది. అమ్మా తనూ గట్టిగా వాదించుకున్నారు. అమ్మ కట్నం తక్కువనీ, ఇన్నాళ్ళూ తమని పట్టించుకోని వాళ్ళు ఇప్పుడు తేలిగ్గా అల్లుడిని సంపాదించుకోవటానికి అభిమానాన్ని చూపించే సరికి తను మోసపోతున్నాడనీ అమ్మ తన అభిప్రాయాల్ని నిష్కర్షగా చెప్పేసింది!

బాబాయి వెళ్ళేటపుడు 'అమ్మతో గొడవెందుకురా' అని తనకి సలహా ఏదో యివ్వబోతోంటే 'ఎదిరించయినా సరే గీతని చేసుకుంటాన'ని చెప్పాడు. ఆవన్నీ బాబాయి అక్కడ చెప్పి వుంటాడు. అందుకే గీత అలా వ్రాసింది అనుకున్నాడు.

అటూ యిటూ తిరుగుతూ గదిలోకి తొంగిచూస్తూ కొడుకు తీరుని అరగంట నుండి గమనిస్తూనే వుంది దుర్గాంబ. ఇక వుండబట్టలేక అడిగేసింది "ఎక్కడ నుండిరా ఆ ఉత్తరం?" అని.

"మీ పుట్టింటి నుండి" నిరాసక్తంగా జవాబు చెప్పాడు. ఆ మాటతో ఆవిడ ఆతృత పెరిగిపోయింది. తనూ వచ్చి ప్రక్కన కూర్చుంటూ అడిగింది "ఏం వ్రాశారేమిటి?"

"ఏం వుంది! రామ్మూర్తి బాబాయి అక్కడికి వెళ్ళినట్లున్నాడు. అంతా వివరంగా చెప్పి వుంటాడు. అందుకని అనవసరంగా మీ తల్లీ కొడుకులిద్దరూ హైరానా పడిపోకండి. మాకు మీ సంబంధం ఏం అవసరంలేదు అని వ్రాశారు."

'హమ్మయ్య! బ్రతికించారు!' పైకే అనేయబోయి ఎలాగో నిగ్రహించుకుని మనసులోనే అనుకుంది దుర్గాంబ. తేలిగ్గా నిట్టూర్చింది!

"ఎంతైనా తోడబుట్టిన వాడు. గుమ్మంలోకి వచ్చి అడిగితే, ఎలా కాదనాలా అని ఆలోచనతో క్రిందా మీద పడి ఛస్తున్నాను! నాకాగొడవలేకుండా వాళ్ళే రాసేశారన్న మాట! పోనీలే, అంతా మన మంచికే! ఏదో కొంప మునిగిపోతున్నట్లు అలా కూర్చుంటే.. ఏం వుందా ఆ ఉత్తరంలో, ఎక్కడ నుండా అని హడలిపోయాను! దీనికేనా, అలా అయిపోతున్నావు? ఇదిగో చూడు మధూ... వాళ్ళింట్లో పది రోజులుండి ఆ పిల్లతో చనువుగా తిరిగేసరికి యిష్టం కలిగి ఆ అమ్మాయినే చేసుకుంటానంటున్నావు. నాలుగు రోజులు పోతే మామూలయిపోతావు! జగన్నాథం గారి అమ్మాయిని చూసావంటే, ఆ అమ్మాయిని తప్ప మరెవ్వరినీ చేసుకోనంటావు! అలా బొమ్మలా వుంటుందా ఆ పిల్ల! సరేలే, అవన్నీ తర్వాత చూసుకుందాం!" దుర్గాంబ గడగడా చెప్పేసి లోపలికి వెళ్ళిపోయింది.

'గీత కంటె అందంగా వున్న అమ్మాయిని చూస్తే, ఆ అమ్మాయినే చేసుకోవటానికి సిద్ధపడతాడాతను?! అమ్మ తన ప్రేమని ఎంత తేలికగా అంచనా వేసింది! మనసులోనే బుసలు కొట్టాడు కోపంతో.

ఆ మధ్య ఆఫీసు పని మీద విజయవాడ క్యాంప్ కెళ్లాడు మాధవ్. అక్కడ స్టేషనులో ఎవరినో పంపించటానికి వచ్చిన బలరామయ్య మేనల్లుడిని చూసి పలకరించి యింటికి తీసుకెళ్లాడు. అక్కడ పదిరోజులపైనే వుండాలి. కాబట్టి హోటల్లో రూము తీసుకుంటానని మాధవ్ అంటే 'అయితే మాత్రం, ఇదేం నీకు పరాయి యిల్లా ఏమిట్రా, ఎన్ని రోజులైనా ఉండొచ్చు' అంటూ బలవంతం పెట్టే సరికి వాళ్ళింట్లోనే వుండిపోయాడు.

బలరామయ్య, దుర్గాంబ స్వంత అన్నాచెల్లెళ్ళయినా, రాకపోకలు కొంచెం తక్కువే. వదినగార్కి కొంచెం అహంకారమనీ, వ్యవసాయంతో జీవిస్తున్న తామంటే చిన్న చూపనీ దుర్గాంబ ఉద్దేశ్యం. అందుకే తల్లి తండ్రీ పోయాక అన్నగారింటికి రాకపోకలంతగా లేవామెకు. ఎప్పుడో బంధువులింట జరిగే శుభకార్యాల్లో కలవటం, ఎప్పుడైనా వెళ్ళి చూసి రావటం, అంతే. మేనరికం ప్రస్తావన యిద్దరి మధ్యా ఎప్పుడూ రాలేదు.

మాధవ్ గీతని అయిదారేళ్ళ క్రితం బంధువుల పెళ్ళిలో చూశాడు. మళ్లీ యిపుడు చూడటమే. ఆఫీసు పని మీద పది రోజుల పైనే క్యాంప్‌కి వెళ్ళొచ్చిన మాధవ్ వస్తూనే 'అమ్మా, నీకో శుభవార్త!' అన్నాడు. అదేమిటోనని ఆనందపడ్డ దుర్గాంబకి మాధవ్ చెప్పిన వార్త వినగానే స్పృహ తప్పినంతపనైంది!

ఆ పది రోజులూ మామయ్య ఇంట్లోనే వున్నాననీ, మామయ్య కూతురు గీత తనకెంతో నచ్చిందనీ, ఆ విషయం మామయ్యకి చెబితే, వచ్చి మాట్లాడ తానని అన్నాడనీ, అన్నీ వివరంగా చెప్పుకొచ్చాడు. చివరకు "పెళ్ళీ, పెళ్ళీ అంటూ నువ్వెలాగూ తొందర చేస్తున్నావు కదాని నీకు సెలక్షన్ చేసే శ్రమ లేకుండా చేశాను చూడు!" అంటూ గొప్పగా చెప్పాడు.

తన అన్న కూతురినే చేసుకుంటానని చెబితే అమ్మ ఎంతో సంతోష పడిపోతుందనుకున్న మాధవ్ అంచనా తారుమారైంది! దుర్గాంబ కోపంతో మండిపడింది. అప్పటి నుండీ తల్లీ కొడుకుల మధ్య యుద్ధం ప్రారంభమైంది! సందర్భం దొరికినపుడల్లా అది కొనసాగుతూ వుంది! మాధవ్ తండ్రి భూపతి మాత్రం ఏం కల్పించుకోకుండా, అదేదో వాళ్ళిద్దరే తేల్చుకుంటారని నిమ్మకు నీరెత్తినట్లుగా వుండిపోయాడు. దుర్గాంబ దృష్టిలో అప్పటికే ఒక సంబంధం వుంది. జగన్నాథంగారు అమెరికాలో డాక్టరుగా చేస్తూ బాగానే గడించాడు. ఆయన కూతురు అమ్మమ్మ దగ్గిరుండి రాజమండ్రిలోనే బి.ఏ. చదువుతోంది. నాలుగైదు నెలల్లో ఆయన ఇండియా వచ్చి కూతురికి పెళ్ళి చేసే వుద్దేశ్యంలో వున్నాడు. నాలుగైదు లక్షల వరకూ కట్నం ఇస్తాడు. ఈ వివరాలన్నీ మధ్యవర్తి ద్వారా తెలుసుకుని అమ్మాయిని బంధువులింట్లో చూసింది. బాగా నచ్చింది. ఇక జగన్నాథంగారు ఇండియాకి రాగానే పెళ్ళి చూపులు ఏర్పాటు చేసి నిశ్చయపరుచుకునే ఉద్దేశ్యంతో వుంది. భూపతిగారు అంతా ఆమెకే వదిలేసి వూరుకున్నారు ఎప్పటిలాగానే.

ఆయన పల్లెలోని వ్యవసాయం తప్ప దేనినీ పట్టించుకోరు. పిల్లల చదువుకోసం రాజమండ్రి మకాం మార్చిన దగ్గర్నుండీ పొలం పనులు చూసుకుంటూ పల్లెకూ, పట్నంకూ మధ్య తిరుగుతూ వుంటారు.

కూతురు లతకి పదెకరాల నిమ్మతోట ఇచ్చినా మాధవ్‌కి పదెకరాల పొలం వుంటుంది. ఎమ్.బి.ఏ. చదివి నెలకి రెండు వేలుపైగా సంపాదించే ఉద్యోగం చేస్తున్నాడు. అందుకే మంచి కట్నంతో అందమైన అమ్మాయిని కొడుక్కి చేయాలని దుర్గాంబ ఆరాటం. అన్నగారు ప్రిన్సిపాల్‌గా చేసి రిటైరయినా ఆస్తిపాస్తులేం అంతగా సంపాదించలేదు. మాధవ్ గీతనే చేసుకుంటానన్న దగ్గర్నుండీ ఆవిడకీ సమస్య పెద్ద తలనొప్పిగా తయారైంది. ఆ రోజు వాళ్ళే ఉత్తరం వ్రాసేసరికి ఆవిడ మనసు తేలికైంది. హాయిగా నిట్టూర్చింది.

మాధవ్ మాత్రం గదిలో నిర్లిప్తంగా అలా పడుకునే వున్నాడు. గీత ఉత్తరంలో వ్రాసిన చివరి వాక్యం అతని మనసును పదే పదే ముల్లులా గ్రుచుతోంది!

మామయ్య దగ్గర ముందుగా తనే పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. ఆయన సంతోషంగా ఒప్పుకుని పెద్దమ్మాయికి యిచ్చినట్లే రెండు లక్షల వరకూ కట్నం యిస్తానని చెప్పాడు. మాధవ్ చిన్నబుచ్చుకుని "అదేమిటి మామయ్యా, కట్నం తీసుకుంటానా" అన్నాడు. "పోనీ కట్నం కాదు. అమ్మాయికి మాత్రం నా ఆస్తిలో హక్కు వుండదా? అమ్మాయికి నేనిచ్చేది చెబుతున్నాను. ఇది మీ అమ్మకు చెప్పు. నేను వచ్చి మాట్లాడతాలే" అన్నాడు.

అంతా నిశ్చయమైపోయినట్లే అనుకున్నాడు. గీతం రూపం. ప్రవర్తనా అన్నీ తనకెంతో నచ్చాయి. గీత తన భార్య అయితే అది తనకో వరమేనని అనుకున్నాడు. మామయ్యతో మాట్లాడిన మరునాడు తను ఆఫీసు బ్రాంచి నుండి వచ్చి డాబామీద తిరుగుతూంటే కాఫీ తీసుకుని గీత వచ్చింది.

గీత ఆ రోజు ప్రత్యేకంగా ముస్తాబైనట్లుగా అనిపించింది. గులాబీ పువ్వులున్న తెల్లని షిఫాన్ చీరె, తెల్ల జాకెట్టు వేసుకుంది. తలంటి పోసుకున్న జుట్టుకు మొట్లోనే రబ్బరు బాండు వేసి వదిలేసింది! ఆ సాయంకాలపు నీరెండలో గీత పసిమిఛాయ మరింతగా మెరిసిపోయింది!

కాఫీ తాగుతూ ఇద్దరూ ఒక వారగా కూర్చున్నారు. తదేకంగా తననే చూస్తుంటే, గీత చిరుకోపంతో చూస్తూ "ఏయ్ బావా, ఏమిటా చూపు? ముందా చూపు మార్చు" అంది.

"ఎలా చూస్తున్నానేం?"

"మామూలుగా మాత్రం కాదు."

"మరి నువ్వు మామూలుగా వచ్చావా!"

"ఎలా వచ్చానేం?"

"సురగంగ కెరటాల నురుగులే రూపుదాల్చి... అన్నట్లుగా వచ్చావు!"

"అబ్బో! కవిత్వం కూడా వస్తోందే!" తమాషాగా కళ్ళెగరేస్తూ పకపకానవ్వింది.

"స్వంతం కాదులే. కొటేషను!"

గీత నవ్వు తనకెంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది. అంత మృదు మధురంగా నవ్వటం గీతకే చాతవునా...?! లేక ఇష్టమైన అమ్మాయి నవ్వులు ప్రతీ యువకుడికీ అలా అనిపిస్తాయా...!

"గీతా, నిన్న మామయ్యతో నేను చెప్పిన విషయం నీకూ చెప్పే వుంటారు. నాయిష్టం చెప్పాను. మరి నీ సంగతేమిటి?"

ఒకసారి కళ్ళెత్తి చూసి తల ప్రక్కకు తిప్పేసుకుంది మౌనంగా.

"మాటలతో వేరే చెప్పాలా అంటున్నాయి నీ చూపులు. అందుకని నీ సమాధానాన్ని ఒ.కె.గా లెక్క వేసేసుకుంటున్నా. ఏవైనా అభ్యంతరాలుంటే, రెండు నిముషాలలోగా చెప్పుకోవచ్చు."

గీత మౌనంగా అలాగే కూర్చుంది.

"గీతా, మన యిద్దరి ఇష్టాలను ఒకరికొకరం తెలుపుకున్న ఈ ఆనంద సమయాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి మనం."

అదెలా అన్నట్లు చూసింది.

"పెద్దవాళ్ళు వేరే చేస్తారు గానీ, ఇది మన ఇద్దరి మధ్యా జరుగుతున్న నిశ్చితార్థం అనుకో! ఏదీ నీ చెయ్యి యిలా యివ్వు. నీ కొకటి ఇస్తాను" అంటూ చొరవగా గీత చేయి అందుకుని అరచేతి నుండి మోచేతి వరకూ వరసగా చుంబించాడు త్వర త్వరగా!

ముందు బిత్తరపోయి, ఆ తరువాత తెప్పరిల్లిన గీత చిరుకోపంతో చేతిని లాక్కుని కొంచెం దూరం జరిగింది.

"బావా, నువ్వు చాలా దూరం వెళ్తున్నావు" అంది.

"దూరమెక్కడ? మధ్యలోనే ఆగిపోయానుగా! లేకపోతే ఆ రూటులోనే అలా అలా చెక్కిలి వరకూ వెళ్ళిపోయేవాడిని తెలుసా?" తమాషాగా నవ్వేస్తూ అన్నాడు.

పెదవుల పైకి దూసుకు వస్తోన్న దొరనవ్వును ఆపటానికి విఫల ప్రయత్నం చేసింది.

"బావా, కట్నం సమస్య రాదంటావా? నీ రేటు కొంచెం ఎక్కువేమో గదా! ఒక్కడే కొడుకువి, ఆస్తిపరుడివి, ఆఫీసరువి, ఆపైన అంద..." ముసిముసి నవ్వులతో ఆపేసింది.

తను పెద్దగా నవ్వేస్తూ "ఆపేశావేం? అందగాడినని కూడా ఒప్పుకున్నందుకు థాంక్స్! కట్నం సమస్య వచ్చిందనుకో, అమ్మతో ఏం చెబుతానో తెలుసా?"

"ఏం చెబుతావేం?"

"అమ్మా, నేను చిన్నప్పుడు నవ్వితే నవరత్నాలు రాలే రాకుమారి కథ చదివాను. ఆ రాకుమారే మళ్ళీ గీతగా జన్మించిందని చూసి తెలుసుకున్నాను. గీత నీ కోడలుగా మన యింటికి వచ్చిన తర్వాత

ఎప్పుడూ నవ్వుతూండేట్లుగా మనం చూసుకున్నామంటే, మన యింట నవరత్నాలపంటే! అని చెప్పేస్తాను. మా అమ్మేం తెలివి తక్కువది కాదుగా నవరత్నాల పంటని కాదనుకోవటానికి! అందుకని ఆనందంగా ఒప్పేసుకుంటుంది!"

గీత కిలకిలా నవ్వేసింది! "చాల్లే! నువ్వన్నీ అతిశయోక్తులు చెబుతావు!"

"ఇందులో అతిశయోక్తి ఏముంది చెప్పు? మనసైన అమ్మాయి చిరునవ్వులే నిజమైన సిరులు మగవాడికి. ఇది కొటేషనుకాదు. గుర్తు పెట్టుకో, నా స్వంతం! ఆస్తి పాస్తులన్నీ మన ఆనందం కోసమే కదా!"

"అంతా అలా అనుకుంటే ఈ కట్నాల సమస్య వుండదు కదా!"

"అంతేకదా!" దీర్ఘం తీస్తూ అన్నాడు.

ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

ఆరోజు తను ఏ ధైర్యంతో అంత నమ్మకంగా నిశ్చితార్థమనీ, ఆదనీ, యిదనీ అంటూ అలా ప్రవర్తించాడు! చిన్నప్పటి నుండీ అన్ని విషయాలలోనూ తనకి స్వేచ్ఛ నిచ్చిన అమ్మ ఇప్పుడు ముఖ్యమైన పెళ్ళి విషయంలోనే అంతగా పట్టుపడుతోంది! పైగా గీత సంగతి వదిలేస్తే, మిగతా సంబంధాలలో తనకి నచ్చిన అమ్మాయినే చేస్తుందట! తన మాట కాదనదట! ఎంత బాగుంది!

ఆ రాత్రి భోజనానికి దుర్గాంబ ఎన్నిసార్లు లేపినా లేవకుండా అలానే నిద్రపోయాడు మాధవ్. మరునాటి నుండీ మామూలుగానే తిరుగుతూంటే దుర్గాంబ 'గండం గడిచింది' అనుకుంది హాయిగా. కానీ తొందరలోనే ఉరుము లేని పిడుగు పడబోతోందని తెలియదు.

రెండు నెలల తర్వాత.

ఆఫీసు నుండి రాగానే అర్జంటు పని మీద క్యాంప్ వెళ్తున్నానని చెప్పి వెళ్ళాడు మాధవ్. కాస్సేపటిలో 'మాధవ్ గారున్నారాండీ' అంటూ పదేళ్ళ అబ్బాయి చేతిలో కవరు పట్టుకుని వచ్చాడు. 'ఎందుకు, ఏమిటి' అని దుర్గాంబ పదే పదే అడగ్గా నక్కుతూ చెప్పాడు. ఆఫీసుకు వెళ్తే యింటికి వెళ్ళారన్నారనీ, అందుకని యింటికి వచ్చాననీ, ఆ ఉత్తరం మాధవ్‌గారికి తప్ప యింకెవ్వరికీ అక్క ఇవ్వ వద్దందనీ చెప్పాడు. 'మరేం ఫర్వాలేదు. నే యిస్తాలే' అంటూ లాక్కుని చదివింది.

మధుబాబూ

మీరు నాలుగు రోజులుగా మా యింటికిరాలేదు. ఆఫీసు వర్కుతో బిజీగా వున్నారో, వూరికెళ్ళారో తెలియలేదు. ఆ రోజు మీరెళ్ళాక మన పెళ్ళి విషయం అమ్మకి చెప్పాను. మొదట ఒప్పుకోలేదు. కానీ మీరు చెల్లాయి పెళ్ళి, తమ్ముడి చదువు, అమ్మ పోషణ, ఈ బాధ్యతలన్నీ తీసుకుంటానన్నారని చెప్పాను. మీ మంచితనం గురించీ, ఉద్యోగం గురించీ గొప్పగా చెప్పే సరికి అమ్మ ఒప్పుకుంది. పెళ్ళి చర్చిలో జరగటానికి ఒప్పుకున్నారని కూడా చెప్పానులెండి. తండ్రిలేని మమ్మల్ని ఆదుకోవటానికి ఆ ప్రభువే మనకిలా పరిచయం కలిగించాడని నమ్ముతున్నాను. మన ప్రేమ ఫలిస్తున్నందుకు నాకెంతో ఆనందంగా వుంది. మీ వైపు నుండి అభ్యంతరాలేవీ వుండవన్నారుగా. ఇక తరువాయి పెళ్ళి మాత్రమే. మీకెంత తొందరగా ఈ శుభవార్త చెబుదామా అని ఎదురు చూస్తుంటే మీరు రాలేదు. అందుకే తమ్ముడితో ఈ ఉత్తరం పంపుతున్నా.

అన్నీ మాట్లాడుకుందాం... రండి వెంటనే. – మీ ప్రియతమ మేరీ.

నిర్ఘాంతపోయి రెండు క్షణాలు అలాగే నిలబడిపోయింది దుర్గాంబ.

ఈ పిల్ల వీడికెక్కడ కలిసింది? అప్పుడే పెళ్ళి వరకూ ఎలా వచ్చింది? ఇంట్లో చెప్పకుండా చేసేసుకునే ఆలోచనలో ఉన్నాడా??

"అమ్మా, అన్నయ్య క్రైస్తవ అమ్మాయిని చేసుకుంటాడా?" తల్లి ప్రక్కనే నిలబడి ఉత్తరం చదివిన లత అడిగింది.

"నువ్వు ఫో! అవతలికి! ఇందాక ఆ రాణి యింటికి పోతానన్నావుగా" కసిరింది. ఇదే సందని తుర్రుమంది లత.

క్యాంప్ నుండి రెండురోజుల తర్వాత వస్తూన్న మాధవ్‌కి గుమ్మంలోనే ఎదురైన లత "అన్నయ్యా నీ పెళ్ళికి లగ్నాలు పెట్టేశారుగా" అంటూ అరిచి చెప్పింది ఆనందంగా.

అక్కడే హాల్లో కూర్చున్న తల్లి వేపు చూశాడు అయోమయంగా.

"అవున్రా, నిన్న నేను సుబ్బమ్మగారు కారులో వెళ్తూరమ్మంటే, నాకూ మొక్కుంది తీర్చుకోవాలని, దుర్గ గుడికి వెళ్ళాను. అంతదూరం వెళ్ళి కనుపించకుండా ఎలా వస్తానని మావయ్య గారింటికి వెళ్ళాను. అన్నయ్య కొంచెం నిష్ఠూరంగా మాట్లాడాడు. 'అబ్బాయి యిష్టపడ్డా నువ్వు ఒప్పుకోలేదుగా, బంధుత్వం కంటే డబ్బే ముఖ్యమనుకున్నావుగా' అన్నాడు. గీతని నేనూ ఈ మధ్య చూడలేదుగా నిన్న చూశాను, నాకూ నచ్చింది. మా వదిన నెమ్మది, అణకువ చూసేసరికి నాకూ యిష్టమై ఎంతైనా కావల్సినవాళ్ళు కదా, ఒప్పేసుకున్నాను. ఇక ఆలశ్యం ఎందుకని దగ్గర్లోనే మంచిరోజు వుందంటే లగ్నం పెట్టించేశాను. ఇక మీ నాన్న మనం అన్నదానికి కాదనటం ఎప్పుడూ లేదుగా!" తాపీగా చెప్పుకొచ్చింది దుర్గాంబ.

"అదేమిటమ్మా, నాతో మాట మాత్రం చెప్పకుండా ఇలా చేశావు?" కొంచెం నిష్ఠూరంగా అన్నాడు మాధవ్.

"ఏం? నువ్వు కోరుకున్న అమ్మాయేగా?"

"అప్పుడు నువ్వు కాదన్నావుగా? నేను... యిప్పుడు..." అని మాధవ్ నసుగుతూంటే "ఎప్పుడయితే ఏమిటి? నువ్వింకేం మాట్లాడకు" కొంచెం గట్టిగా అంది దుర్గాంబ.

ఇక ఏం మాట్లాడలేని వాడిలా మౌనంగా లోపలికి వెళ్ళిపోయాడు.

నిర్ణయింపబడిన వేకువ ఝాము ముహూర్తానికి మాధవ్, గీతల పెళ్ళి జరిగిపోయింది అట్టహాసంగా, ఆనందంగా! ఇద్దరి వదనాల్లోనూ ఆనందం, ఉత్సాహం వెల్లివిరుస్తున్నాయ్! చుట్టూ జనం వుండటం వలన కబుర్లు లేవుగానీ ముసి ముసి నవ్వులూ, ఓర చూపులూ మధ్య పెళ్ళి తంతు ముగిసింది!

ఆ సాయంకాల గీత ఒంటరిగా కనుపిస్తుందేమో, కాస్సేపు మాట్లాడదామని ఎదురు చూస్తున్న మాధవ్‌కి చివరకు ఆ ఛాన్సు దొరికింది. లతతో కబుర్లు చెబుతూ గదిలో కనుపించింది. మాధవ్ రాగానే లత పరుగెత్తింది బయటకు.

గీతని చూడగానే షాక్ తగిలినట్లు ఫీలయ్యాడు. ముక్కు ఎర్రబడిపోయింది. కళ్ళల్లోతడి!

"ఏం జరిగింది గీతా?" అదుర్దాగా అడిగాడు.

"జరగ కూడనిదే జరిగిపోయిందిగా! పాపం, నీకు, నీమేరీ దూరమైపోయింది. ఇప్పుడే మాటల సందర్భంలో లత నీ ప్రేమకథ చెప్పింది. చిన్నపిల్లకదా, మర్మం తెలియదు మరి. అత్తయ్య తనంత తానుగా వచ్చి పెళ్ళి ప్రస్తావన తెచ్చింది ఎందుకో ఇప్పుడర్థమైంది! కొడుకు మతాంతర వివాహం ఎక్కడ చేసుకుంటాడోనని భయపడి ఈ పెళ్ళికి ఒప్పుకుందన్నమాట!

అయినా బావా, నీ మనసింత చంచలమా? రెండు నెలల్లోనే మళ్ళా ప్రేమలో పడ్డావా? ఏం గొప్పగావుంది! నేనేమో ఇంకో రెండేళ్ళ వరకూ పెళ్ళి మాటెత్తితే వూరుకోనని చెప్పాను యింట్లో. అసలు అప్పటికైనా నా మనసు స్వాధీనంలోకి వస్తుందా. నిన్ను మరిచిపోగలనా అని నేను బాధపడితే... నువ్వేమొ... అప్పుడే..." దుఃఖంతో గీత కంఠం పూడుకుపోయింది.

"ఓహ్! ఏమిటోననుకున్నాను! దీనికా నీ బాధ!" పకపకనవ్వాడు మాధవ్.

చిరాగ్గా చూసింది గీత

"ఒక గీతని చెరపకుండా చిన్నది చేయమంటే, దాని ప్రక్కనే ఒక పెద్ద గీత గీసాడట ఒక తెలివిగలాయన! అలాగే నేనూ అమ్మ దృష్టిలో నష్టాన్ని చిన్నదిగా చేయటానికి ఈ గీత ప్రక్కన మేరీ అనే పెద్ద గీతని నిలబెట్టాను."

"ఏమిటీ ఈ గీతల గొడవ! అసలు సంగతి చెబుదూ చంపక" చిరాకు పడింది గీత.

"ఏం వుంది! అమ్మ దృష్టిలో ఒక డాక్టరు కూతురు వుంది. ఆ అమ్మాయి నెత్తి మీద నాలుగు లక్షల కట్నం వుంది. నీ మీదేమో రెండు. అంటే అమ్మకి నీలో రెండులక్షల నష్టం కనిపిస్తోంది! దానికే సిద్ధపడేలా చేయాలంటే ఏ మాత్రం కట్నంలేని, బరువు బాధ్యతలు, మతాంతరం యివన్నీ వున్న మేరీని రంగంలోకి తీసుకువస్తే సరి అనుకున్నాను. నా ఫ్రెండు ప్రక్కింటి కుఱ్ఱాడికి డబ్బులిచ్చి ట్రైనింగిచ్చి నాటకమాడాం! మేరీ అంటూ ఎవరూలేదు.

నాకీ ఆలోచన అమ్మ మాటలలోనే వచ్చిందిలే. నీ ఉత్తరం వచ్చిన రోజు నేను బాధపడుతూ నా గదిలో పడుకుని వున్నాను. నీ ఆలోచనల మధ్య వున్న నాకు అమ్మ, రంగమ్మల సంభాషణ సగం నుండి వినిపించింది. అమ్మ రంగమ్మతో ఏదో తెప్పించింది కాబోలు. అది బాగా లేదని మళ్ళా మార్పు తెప్పించి, అదీ బాగాలేదని ముందు తెచ్చిందే తెమ్మంటూందని నాకు అర్థమైంది.

రంగమ్మ 'చీకటి పడిపోయింది. ఏదైనా దండగే అంటున్నారుగా వుంచేసెయ్యండీ' అంటోంది. 'అదయితే నాలుగు రూపాయలే నష్టం. ఇదయితే పది రూపాయలు నష్టం. ఒక్క క్షణం వెళ్ళి యిదిచ్చేసి అదే యిమ్మన్నారని పట్టుకురా. అసలెప్పుడూ యిక యిక్కడి షాపులో తెప్పించను' అంది అమ్మ. 'తిప్పి చంపుతున్నారండీ' అంటూ రంగమ్మ వెళ్ళింది. అమ్మ ఆ మాటలతో ఈ ఆలోచన కలిగి అమ్మ ఎలా చేస్తుందని ఊహించానో అలాగే చేసింది" నవ్వుతూ చెప్పాడు.

"అయితే అత్తయ్యను మోసం చేశావన్నమాట!"

"మోసంకాదు. నేను కోరుకున్న అమ్మాయిని ఉపాయంతో గెలుచుకున్నాను. నువ్వేమొ పెద్ద పెద్దలం...తా అంగీకరిస్తేనే కానీ వీల్లేదని షరతుపెట్టావుగా!"

మాధవ్ చెబుతున్న తీరుకి తేలికైన మనసుతో ఆనందంగా నవ్వేసింది గీత.

పదిరోజుల్లోనే గీత కాపురానికి కూడా వచ్చేసింది.

ఒకరోజు...

దుర్గాంబ కోడలితో పిచ్చాపాటీ మాట్లాడుతూ ఒకసారి నగల విషయంలో కంసాలి చేయబోయిన మోసం గురించి చెబుతూ "నన్ను బోల్తా కొట్టించటం అంత సులువుకాదని వాడికేం తెలుసూ" అంది.

"అత్తయ్యా! నువ్వలా అనుకుంటున్నావుగానీ మీ అబ్బాయే నిన్ను బోల్తా కొట్టించాడు తెలుసా?" ఉండబట్టలేక బయటపెట్టింది గీత.

"మేరీ అనే పిల్ల ఎవరూ లేరని, అంతేగా?" దుర్గాంబ నవ్వుతూ అడిగేసరికి గీత ఆశ్చర్యంతో బిగుసుకుపోయింది!

"నీకు తెలుసా అత్తయ్యా?"

"మా అమ్మనిలా బోల్తా కొట్టించానని నీకా మేరీ సంగతి చెప్పాడు కాబోలు! నేను ఉత్తరం చదివాక ఆ పిల్లాడు జారుకుంటుంటే పట్టుకుని గట్టిగా దబాయించాను. భయపడిపోయి అంతా చెప్పేశాడు నాటకమని. నేనిలా చెప్పేసినట్లు చెప్పకండి. కోప్పడతారని ప్రాధేయపడితే సరేలే పొమ్మన్నాను. అయినా అనుమానం తీరక ఏవైనా ఉత్తరాలవీ దొరుకుతాయేమోనని వాడి గదిలో అలమారా అంతా వెదికాను. అప్పుడు నువ్వు వ్రాసిన ఉత్తరం కనబడితే చదివాను. నాకప్పుడర్థమైంది వాడు నిన్ను మరిచిపోలేదనీ, నీ కోసమే ఈ నాటక మాడి వుంటాడనీ. ఆ ఉత్తరం చదివాక నీ స్వభావం కొంత అర్థమైనట్లయింది నాకు. చిత్రంగా నాకూ నీ మీద యిష్టం కలిగింది. అందుకే ఇక ఆలశ్యమెందుకని మరునాడే మీ యింటికి బయలుదేరి వచ్చాను. కాకపోతే వాడేదో ఉపాయంతో సాధించుకున్నట్లుగా లోలోపల ఆనందపడి పోతున్నాడని గమనించీ వూరుకున్నాను. వాడి ఆనందం వాడిదని. వాడు ఉపాయంతో నన్ను గెలిచానని అనుకుంటున్నాడు గానీ, నాకు నచ్చినందువల్లే నువ్వీ యింటి కోడలు వయ్యావని వాడికి తెలియదు".

"అత్తయ్యా, బావ నన్ను కోరి చేసుకున్నాడని ఆనందంగా వున్నా, నిన్ను తప్పుదారి పట్టించినందువల్లే నేనీ యింటి కోడలిని కాగలిగాననే అసంతృప్తి నాలో మెదులుతూనే వుంది. ఈ వేళ్టితో అది తీరిపోయింది! నిజంగా నాకు యిప్పుడు చాలా... చాలా సంతోషంగా వుంది!"

గీత కంఠంలో ఆనందం సుళ్ళు తిరిగింది.

"అత్తయ్యా మిమ్మల్నిద్దర్నీ విడివిడిగా గెలుచుకున్నాను. నిజానికి ఈ గెలుపు నాది" అంది గీత సంతృప్తిగా!

"అవునూ, ఆ ఉత్తరంలో నవరత్నాలు అంటూ వ్రాశావేమిటీ?" ఆరా తీసింది దుర్గాంబ! గీత కిలకిలా నవ్వేసి అక్కడ నుండి పారిపోయింది. 'సమాధానం చెప్పకుండా అలా నవ్వుతూ పారిపోయిందేమిటి చెప్మా...' బుగ్గన వేలేసుకుని ఆశ్చర్యంగా చూస్తూండి పోయింది దుర్గాంబ.

ఆంధ్రపత్రిక వీక్లీ. 11-17, సెప్టెంబరు, 1987.